క్లుప్తంగా

శ్రీరాముడికి వెండి ఆభరణాల బహూకరణ



ఆలయ నిర్వాహకులకు వెండి ఆభరణాలను అందజేస్తున్న బాలేశ్వరీ కుటుంబసభ్యులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీరామ మందిరానికి గాంధీనగర్ కాలనీకి చెందిన సుతారి బాలేశ్వరీ కుటుంబసభ్యులు 32 తులాల వెండితో తయారుచేసిన 10 ముత్యాల హారాలు, 25 తులాల వెండి కిరీటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు వేణుగోపాల్, ప్రతాప్‌కుమార్, మంజుల, శ్రీకాంత్, శ్రీచరణ్, చిన్న, పవన్, అఖిలాశ్, సాగర్, జ్ఞానేశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, ఉపాధ్యాయులు

మొయినాబాద్: మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, అలివేలుకు గురువారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఐదేళ్ల పాటు శ్రీరాంనగర్ పాఠశాలలో పనిచేసి ఉత్తమ సేవలు అందించారని గుర్తుచేశారు. అదేవిధంగా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు సుజాత, స్వర్ణలతలను సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వినోద, పాఠశాల హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రవి, అనంతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ దరఖాస్తులకు బారులు



దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించుకునేందుకు క్యూ కట్టిన జనం

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో భాగంగా అమలు చేసిన ఉచిత కరెంట్, 500లకే గ్యాస్‌లకు దరఖాస్తులు చేసుకొని లబ్ధి పొందని ప్రజలు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు మూడు కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు ఉచిత కరెంట్, గ్యాస్ పథకానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేసుకునేందుకు రేషన్ కార్డు, ఆధార్‌కార్డును దరఖాస్తుతో జతచేసి కౌంటర్లలో పరిశీలన చేయిస్తున్నారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల ప్రజలు అధికంగా రావడంతో సందడి నెలకొంది. అధికారులు మూడు కౌంటర్లను ఏర్పాటు చేయించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నగరంలో ఆయనను కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య బుధవారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డిలు ఉన్నారు.

కళతప్పిన ఎంఈఓ కార్యాలయం

ఏళ్ల తరబడిగా ఇన్‌చార్జితోనే కొనసాగింపు

- కేవలం అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లే దిక్కు
- దాదాపు ఐదేళ్లుగా శంకర్‌పల్లి మండల ఎంఈఓకు ఇన్‌చార్జి బాధ్యతలు
- పట్టించుకోని అధికారులు



చేవెళ్లలో నిరుపయోగంగా విద్యా వనరుల కేంద్రం

చేవెళ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు, ఉపాధ్యాయులకు కేంద్రంగా ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని పట్టించుకునేవారు లేక నిరుపయోగంగా మారింది. మండలంలో 34 ప్రాథమిక పాఠశాలలు, 13 ప్రాథమికోన్నత పాఠశాలలు, 16 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాల ఇలా మొత్తం 66 పాఠశాలలు ఈ మండల విద్యా వనరుల కేంద్రం కింద ఉన్నాయి. ఒకప్పుడు ఈ విద్యా వనరుల కేంద్రం కళకళలాడుతుండేది. ఇప్పుడు ఎవరు లేని పాడుబడిన పాతభవనంగా మారిపోయింది.

ఐదేళ్లుగా ఇన్‌చార్జితోనే..

ఈ కార్యాలయంలో ఉండాల్సిన మండల విద్యాధికారి పోస్ట్ సైతం ఖాళీగా ఉండటంతో శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్‌కు అదనపుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దాదాపు 5 ఏళ్లు అవుతున్నా ఇన్‌చార్జి ఎంఈఓనే కొనసాగుతున్నాడు. రెండు మండలాల బాధ్యతలను నిర్వహిస్తుండడంతో ఆయన ఎప్పుడు అందుబాటులో ఉండటం లేదని ఉపాధ్యాయుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం మండలంలో ఉండే ఎవరైనా సీనియర్ హెచ్‌ఎంకు బాధ్యతలను అప్పగిస్తే మండలంలోనే అందుబాటులో ఉంటాడని అంటున్నారు. అందుబాటులో ఉండని అధికారితో ఎంఈఓ కుర్చీ ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. ఈ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, అంటెండర్ ఇద్దరే ఈ కార్యాలయానికి అన్ని తామై వ్యవహరిస్తున్నారు. ఎవరూ పట్టించుకునేవారు లేకపోవటంతో ఈ కార్యాలయం నామమాత్రంగా కనిపిస్తోంది. ఎవరైనా ఎంఈఓ కార్యాలయానికి వస్తే పాడుబడిన పాత భవనంగా ఎంఈఓ కార్యాలయం కనిపిస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం కొత్తగా బదిలీలపై వస్తున్న ఉపాధ్యాయులు ఈ ఎంఈఓ కార్యాలయం పరిస్థితిని చూసి ఇదేమీ కార్యాలయం అని ఆశ్చర్యపోతున్నారు.

అనేక సమస్యలతో సతమతం

మండల విద్యా వనరుల కేంద్రంలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. అందుబాటులో ఉండాల్సిన మండల విద్యాధికారి లేకపోవటంతో ఉపాధ్యాయులు తమ సమస్యలను విన్నతులను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో పడుతున్నట్లు చెబుతున్నారు. కార్యాలయం



కార్యాలయంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీ

మరమ్మతుల కోసం నిధులు మంజూరైనా అభివృద్ధికి నోచకోవటం లేదు. ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఎంఈఓ రెండు మండలాలు ఉండటంతో చేవెళ్ల మండల కార్యాలయాన్ని పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విరిగిన కిటికీలు, వర్షానికి తడిసి పాడుబడిన భవనంగా ఆఫీస్ మారిపోయింది. కార్యాలయంలో సిబ్బందికి బాత్‌రూమ్‌లు కూడా లేవు. ఇలాంటి సమస్యల మధ్య దుర్భరంగా ఉన్న మండల విద్యా వనరుల కేంద్రాన్ని ఉన్నతాధికారులు పట్టించుకోవాలని పలువురు ఉపాధ్యాయ సంఘం నేతలు కోరుతున్నారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ కార్యాలయాన్ని బాగు చేయాలని ఆందోళన కూడా చేశారంటే పరిస్థితి ఉన్నతాధికారులు అర్థం చేసుకోవాల్సి ఉంది.

కార్యాలయానికి వచ్చే అవసరం తగ్గింది



గతంలో ఉపాధ్యాయుల సర్వీస్ ఎంట్రీలు, బిల్లులకు సంబంధించిన అన్ని పనులు ఎంఈఓ కార్యాలయంలోనే జరిగేవి. కానీ ఇప్పుడు ఆ బాధ్యతలు అన్ని కాంప్లెక్స్‌లుగా విభజించటంతో ఎంఈఓ కార్యాలయానికి వచ్చే అవసరం తగ్గింది. మండలంలో నాలుగు కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలకు ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల బాధ్యతలను అప్పగించారు. దీంతో ఇప్పుడు ఉపాధ్యాయులు ఎంఈఓ కార్యాలయానికి రావటం లేదు. ఇక్కడ ఆపరేటర్, అటెండర్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్‌లు ఉంటారని వారితో పాటు సీఆర్పీలు కూడా వస్తుంటారని చెప్పారు. భవనం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమేనని కొత్త భవనం కావాల్సి ఉంది. దీని గురించి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తాం. ఇన్‌చార్జి ఎంఈఓ అయినా నా బాధ్యతలను నేను సక్రమంగా నిర్వహిస్తూ రెండు మండలాలల్లో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటున్నాను.

–అక్బర్, మండల ఇన్‌చార్జి విద్యాధికారి

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకం

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



మాట్లాడుతున్న గోవర్ధన్‌యాదవ్

చేవెళ్ల: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలమని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హైతాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. బదిలీపై వెళ్లిన సుదర్శన్, రూబీ, పరమేశ్ రెడ్డి, భాగ్యలక్ష్మి, అమృత, జయన్న, పాండురంగంలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఉపాధ్యాయుడికి బదిలీ తప్పనిసరన్నారు. అంకితభావంతో పనిచేసినప్పుడే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుందని, ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లినా విద్యార్థుల మనస్సును చూరగొనే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయు మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, వివిధ మండలాల అధ్యక్షులు వీరమల్లేశ్, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, జయరాజ్, యాదయ్య, పాఠశాల హెచ్‌ఎం వసంత, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, మాధవి, గీత, గోవింద్, వెంకటేశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే యాదయ్య, చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: ఖాళీగా ఉన్న స్థలాల్లో అవకాశం ఉన్న ప్రతి చోట విరివిగా మొక్కలు నాటి, సంరక్షణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మనహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని ఎంఎస్‌ఆర్ వెంచర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలని సూచించారు. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు గోపాల్, అశోక్, చంద్రమౌళి, నాయకులు ప్రవీన్, పాండురంగారెడ్డి, రాంరెడ్డి, బాలక్రిష్ణ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రాథమిక సహకార సంఘం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల మేనేజర్లు, సెక్రటరీలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో ప్రాథమిక సహకార సంఘాల పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముక అన్నదాతలని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. నియోజకవర్గంలోని ప్రాథమిక సహకార సంఘాల్లో 22,694 మంది సభ్యత్వాన్ని పొందారని, ఈ సంఘాల ద్వారా రైతులకు రూ.6.58కోట్ల రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాల గ్రామానికి చెందిన నాగం భానుప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికసాయం అందించాలని బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి రూ.4.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ పత్రాన్ని పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సతాయించిన సర్వర్

ఆగిన ధరణి రిజిస్ట్రేషన్లు



తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న రైతులు



సాయంత్రం 6 గంటల తర్వాత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలుపెట్టిన ఆపరేటర్లు

మొయినాబాద్: సర్వర్ సమస్యతో గురువారం ధరణి రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ రాకపోవడంతో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం 20 స్లాట్ బుకింగ్‌లు ఉన్నాయి. భూమి విక్రయించేవారు.. కొనేవారు అందరు ఉదయం 10 గంటల నుంచే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. కానీ సర్వర్ రాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ అక్కడే వేచి ఉన్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత సర్వర్ పనిచేయడంతో రిజిస్ట్రేషన్లు చేయడం మొదలుపెట్టారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొందుర్గు: బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతి శ్రీకాంత్‌గౌడ్ నియామకం కాడవంతో గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ నాయకులు మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, కొందుర్గు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి

శంకర్‌పల్లి: తమ గ్రామంలో కబ్జాకు గురవుతున్న శ్మశానవాటికను కాపాడాని కోరుతూ కొజ్జాగూడ గ్రామస్తులు గురువారం శంకర్‌పల్లి చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని 85 సర్వే నెంబర్‌లో 1 ఎకరం 16 గుంటల భూమి స్మశానవాటికకు ఉందని దీనిని గ్రామానికి చెందిన నర్సింలు అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడని దీనిని కాపాడాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి తాము ఆ స్థలాన్ని అంత్యక్రియలకు వినియోగిస్తున్నామని తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని అధికారుల అండతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం

పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్



బస్సును ప్రారంభిస్తున్న గౌరీ సతీశ్, డిపో మేనేజర్ మూర్తి

మొయినాబాద్‌రూరల్: మారుమూల గ్రామాలకు, ప్రజలకు సౌకర్యం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి గత నాలుగు సంవత్సరాలుగా కరోనాతో ఆగిపోయిన ఆర్టీసీ బస్సులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో టోల్‌కట్ట, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి గ్రామాలకు రోజు మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యాన్ని మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తి నక్కలపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరీ సతీశ్ పాల్గొని డిపో మేనేజర్‌ను సన్మానించారు. అదే విధంగా బస్సును రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గౌరీ సతీశ్ మాట్లాడుతూ.. ప్రయాణికుల కష్టాలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మంత్రి కృషితో డిపో మేనేజర్ స్ఫూర్తితో నక్కలపల్లి గ్రామానికి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు ట్రిప్పుల బస్సును పునఃప్రారంభించినందుకు ఈ గ్రామాల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బొలిగిద్ద సత్యనారాయణ, గౌరీ రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలి

ఆర్టీసీ అధికారులకు ఏబీవీపీ నాయకుల వినతి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం వికారాబాద్ డిపోకు చెందిన కంట్రోలర్‌కు విద్యార్థుల కోసం బస్సులు నడిపించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి స్వార్థం కోసం కేటాయించిన ఫ్రీ బస్సు స్కీమ్‌ల కారణంగా సామాన్య ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. మండలంలో చుట్టూ ఉన్న గ్రామాల నుంచి అనేక మంది విద్యార్థులు చదువుకోవడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులను ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులు బస్‌పాస్‌లను తీసుకుంటూ ఆర్టీసీ డిపార్ట్‌మెంట్‌కు డబ్బులు చెల్లిస్తున్నా విద్యార్థుల కోసం సరైన బస్సులను నడిపించటం లేదన్నారు. విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం సమయంలోనే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగిరాకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున విద్యార్థులతో రోడ్లపైకి వస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రదీప్, రాఘవేందర్, కిష్టర్, ప్రేమ్, నితీశ్, శ్రీకాంత్, హఫీజ్, మోహన్, ప్రణయ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

జనాభా నియంత్రణలో భాగస్వాములు కావాలి



షాద్‌నగర్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి



చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: జనాభా నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ, అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ పద్ధతి పాటిస్తే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. జనాభా పెరగడంతో ఉద్యోగ అవకాశాలు సరిగా లభించవని, దీంతో విద్యాపరంగా ఎంతో నష్టం జరుగుతుందన్నారు. వివాహ వయస్సును ప్రోత్సహించి మొదటి బిడ్డ పుట్టిన తర్వాత రెండో సంతానానికి మధ్య వ్యవధి పాటించాలన్నారు. జనాభా రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి జనాభా స్థిరీకరణ కోసం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రతి ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యులు స్రవంతి, రాఘవేందర్, సిబ్బంది శ్రావణ్‌కుమార్, అమృత, శ్రీరామ, పుష్పలీల, రెడ్యానాయక్, గౌస్, రవి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నియంత్రణకు కృషి చేయాలి: డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

చేవెళ్ల: జనాభా నియంత్రణకు అందరూ కృషి చేయాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ జనాభాలో అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో మన దేశం ముందు వరుసలో ఉందన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల సీజన్ కావటంతో ప్రజలు డెంగీ, విష జ్వరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం ఫీవర్ సర్వే కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, మంజుల, సంతోష, ఎంపీహెచ్‌ఈఓ బల్‌రాం, ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఎల్‌టీలు, డీఈఓలు, ఆశవర్కర్లు ఉన్నారు.